భవిష్యత్తులోకి తొంగిచూపు

# ఆ తెరే, వైఫల్యకారణం!

జి. వి. జ్వాలా నరసింహశాస్త్రి

అది కలియుగంలోని కలకలలాడే. కలిమి లేములు లేని ఒక ఉదయం.

"ఏమి టిలా ఉందేమిటి యీ జగత్తు?"

"అవును - ఇల్లా ఉండటమే యీ జగత్తు లక్షణం!"

"ప్రపంచమేగా యిది?"

"ఆ. ప్రపంచంలోని ఒక అంతర్భాగాన్నే మనం చూస్తున్నాం."

"మరి యీ మనుషు లిట్లా వున్నారేం?"

"వారు ప్రకృతికి లోబడని పురుషులు-వారు జరామరణాలు లేని వాళ్లు-నిద్రాక్షుత్తులు కలగని వాళ్లు."

"ఐతే, మరణాలూ జన్మలూకూడా ఎల్లా లేకుండా వుంటారూ?"

"వారంతా బుద్ధిమంతులై యింకా జన్మలు వుండకూడదని శాసనాలు విధించుకుని రాజ్యాలు పాలిస్తున్నారు"

"రోగాలూ, కోరికలూ, ఆవేశాలూ యిల్లాంటివి వాళ్ళ కంటాయ్యా-అవికూడా వాళ్ళ వశమయినయ్యా?"

"కోరికలూ, ఆవేశాలూ మాత్రమే వాళ్ళ వశంలో లేవు. తక్కినవన్నీ వాళ్ళ వశమయినయ్. రోగాలు రాకుండా అన్ని మందులూ కనిపెట్టారు. మరణాన్నికూడా ఔషధాలవల్లనే నిరోధిస్తున్నారు. ముసలితనం వారి ఉద్దేశంలో ఒకవిధమైన రోగం!"

"మరి చావాలని కోరికలు వాళ్ళకుండవ్?"

"చావాలనిఉండదూ? అందుకే ఔషధాలు! చంపాలని వుంటుంది; ఆవేశంతో చంపుకునేస్తారు."

"అదిమాత్రం ఎట్లా సాధ్యమౌతుంది కనక-"

"అది కూడా ఔషధాలవల్లనే- వాళ్ళ శాస్త్రజ్ఞానం- బహుసున్నితమైంది. బొగ్గులోంచి నెయ్యిని తీస్తారు. వాయువులోంచి ఆహారపదార్థాల్ని, పానీయాలనూ కూడా స్వీకరిస్తారు."

"అయితే, కోరికలూ, కోపాలూ పోయే ఔషధాలు వారి శాస్త్రచర్చలో యింకా లేవు కాబోలు!"

"అంతదూరం వారి బుద్ధి పోలేదు. వారి విజ్ఞానం, సర్వప్రపంచాన్నీ వశం చేసుకుని రాజ్యం చేయటానికే- కాని వారెవరో - ఎందుకొచ్చారో తెలుసుకోటానికి కాదు; అట్లా తెలుసుకుంటే యీ ప్రజ యిల్లా వుండకే వుండదు-"

"క్రొత్తమానవుల్ని లేబరీటరీల్లో సృష్టి చేసే విజ్ఞానం అంతమాత్రం- ఆత్మాన్వేషణం చెయ్యకూడదూ?"

"అదుగో - చూడు - అదుగో తెర - వో బూచిగా బూజూరు బూజూరు మంటూ-ఒక మబ్బు రంగు తెర వారి కపాలాలమీద కనిపించడం లేదూ? ఆ తెరే వారి తెలివిని ముందుకు పోనీయకుండా చెలియలకట్టలా నిలబడి వుంది."

"ఆ తెర పోయే విధానం లేదూ?"

"వారి ప్రస్తుత ఆహారం మారిపోవాలి. మనం తినే ఆహారం క్రొత్తగా వారు మళ్ళీ తీసుకుంటే ఆ అడ్డం పోతుంది."

"ఇప్పుడు వాళ్లు తీసుకుండే ఆహారం ఏమిటి?"

"అదుగో, ప్రతివాళ్ళ జేబుల్లో యంత్రాలు చిన్న చిన్నవిగా లేవూ- ఆ యంత్రాలు గాలిలోంచి ఆహారాన్ని వాళ్ళకు తయారుచేస్తయ్. ఆ ఆహారంతో వారి శరీరబలానికి కావాల్సిన మాంసకృత్తులూ జీవకణాలూ ఏర్పడగలవ్- వారికి అధికాచమాన అల్పాచమానము లుండవ్- వీకే రోగాలు కలగవ్"

"అంతేనా, పాములమాదిరి వాళ్లకు ఆహారం!"

"అంతే, యినుము మొదలైన లోహాల్లోంచి కూడా రసాయనిక సంబంధమైనవి-తీసి ఆహారాలుగా అప్పుడప్పుడు స్వీకరిస్తారు. ఐతే మనం

తిన్న పన్యాహారం వాళ్ళకిప్పుడు భూమిమీద దొరకదు."

"ఎందుకని?"

"అదే, భూమి అంతా నాల్గవ ఆటంబాంబు యుద్ధంతో గాజు గట్టిపోయింది. అప్పుడు ఒక్క చెట్టుకూడా లేకుండా గాలిలో ఒక వైపరీత్యం పుట్టి, తుడుచుకపోయినయ్. ఈ శతాబ్దం జనానికి, చెట్టు చేమ అంటే అర్థంకాదు. వాళ్లు ఆ మాటలు వెదికి అర్థం గ్రహిద్దామన్నా 'పద కోశా'లు లేవు. ఏమంటే వారి కాలంలో పదహారుసార్లు విజ్ఞానవిప్లవాలుజరిగాయి ఒక్కొక్క విప్లవంలో ఒక్కొక్క క్రొత్త శబ్దకోశం పుట్టింది. ఇప్పుడు వారి భాషలో "మొక్క" శబ్దంలేదు. మనకాలపు ప్రపంచంలో 'మొక్క' సామాన్య శబ్దం."

"వారికి మరి-గ్రంథాలయాలెక్కడ?"

"వారికి మనలాగా గ్రంథాలుండవ్. వారి విజ్ఞానమంతా శబ్దరూపంతో యంత్రాల్లో దాచి పెట్టబడివుంది. ఆ యంత్రాన్ని త్రిప్పినప్పుడు, ఆ శాస్త్రవిషయం వారికి వినిపిస్తుంది- వాళ్ళకు లిపులు-వ్రాతలూ-లేవు."

"ప్రపంచంలోని వారంతా ఒక్కటే భాషను మాట్లాడుతుంటారనుకుంటాను."

"అవునవును, ఏడవ వైజ్ఞానిక విప్లవంలోనే ప్రపంచంలో మానవులు యిన్నిరకాల భాష లుండకూడదని తేల్చారు."

"నాకు వీళ్ళనిట్లు చూస్తేనే ఆశ్చర్యం వేస్తుంది. ఒక్కొక్క వ్యక్తికీ ఒక్కొక్క పిట్ట గూడులాగా గాజు యిల్లు!!"

"మనకు పొడుగాటి యిటుకరాతి మేడలూ, ఆకాశాన్నంటే భవనాలూ వుండేవి. వాళ్ళకల్లా కాదు. వాళ్ళకు సంసారాలూ కుటుంబాలూ లేవు. కనుక యిల్లా వుంటారు ఆటంబాంబుల వలన వాళ్ళకు చెరుపు లేకుండా వుండడానికి యీరకంగూళ్ళే-శరణ్యాలు!

"అబ్బా, యిక్కడ దమితంగా వుంది చలి. మనం భరించలేం-యింకో చోటికి పోదాం!"

"కాదు, ప్రపంచము అంతా యిట్టి శీతల స్థితిలోనే వుంటుంది. మన మెక్కడికి పోయినా యిల్లాగే వుంటుంది."

"ఎందుకని? అత్యుష్ణమండలాలున్నాయిగా!?"

"లేవు-ఇంకా అత్యుష్ణమండలాలూ, కాంగో ఎమెజాన్ అడవులూ యింకా లేవు. ఈ ఈ మానవులు సూర్యరశ్మిని కూడా వినియోగించుకుంటూ, ఎక్కువ ఉద్దీపనానికై యంత్ర చలనానికై బొగ్గుకు బదులుగా సూర్యరశ్మి ఉపయోగించుకుంటున్నారు."

"అయితే, ఇప్పుడు-బొగ్గు, చమురు, జలశక్తులతో కాదా, వాళ్ల యంత్రాలు నడపటం!"

"కాదు. బొగ్గు చాలా కాలం క్రిందటనే, అంటే- మూడో ఆటంబాంబు యుద్ధంలోనే భస్మమై పోయింది. చాలా క్రొద్దిగా మిగిలిన దాన్ని ఆహారోత్పత్తికై, మందుసరకుగా వుపయోగిస్తున్నారు. చమురు గనులు యింకిపోయినై. జల శక్తికంటే అతి సులభంగా సూర్యకిరణాల శక్తిని కేంద్రీకరణం చేసి ఉష్ణోత్పత్తిని కల్గించే సాధనాలు వాళ్లు కనిపెట్టారు — అందువల్ల - వేసగి వర్షాకాలాలూ వుండవ్. ఎప్పుడూ యిల్లాగే అతి శీతలంగా పరిమితమైన ఉష్ణస్థితిలో ప్రపంచం నడుస్తోంది."

"అందుకోసమేనా, ఆకాశంలో మబ్బులు కన్పించనిదీ?"

"అందుకే! వారు మాత్రం ఆహ్లాదార్థంగా అప్పుడప్పుడు మేఘాలను సృష్టించి, వాటిచేత వానలను కురిపించి ఆనందిస్తుంటారు."

"ఇదంతా యాంత్రిక సహాయమేగా?"

"అవును, ఇది మరి యంత్రజగత్తు కదూ?"

"వాళ్ళు మనకాలంలో వున్న అగ్నిపర్వతాలనూ, భూకంపాలనూ ఎల్లా కట్టుబాటులో పెట్టుతున్నారో?"

"వాటిని కూడా కట్టుబాటులో పెట్టి, విముఖంగా విరుద్ధంగా వున్న ప్రకృతిశక్తుల్ని సుముఖం చేసుకుంటున్నారు."

"ఇది చాలా విచిత్రమైన జగత్తే- నిజంగా మనం యిదంతా చూస్తున్నామా? లేక- కలలు కంటున్నామా?"

"కాదు. కలలు కాదు- మనం నిజంగా విశ్వాన్ని పర్యాలోకించుతున్నాం. మన కాలంలో మనం కనిపెట్టిన విమానాలనూ దూరశ్రవణ యంత్రాలనూ చూచి ముసలివాళ్లు ఎల్లా భ్రమించారో, అల్లాగే- మనం- మన కన్నా

కొన్ని వేల శతాబ్దాల తర్వాతి సంతతిని చూచి ఆశ్చర్యం పొందటం సహజం-''

"వాళ్ళిప్పుడు- మనను ఎన్ని వేల శతాబ్దాల వెనకాలి వ్యక్తుల్నిగా తలుస్తారో ?"

"వాళ్లు కాలదూరాలకు- అతీతులయ్యారు. వాళ్లకు శతాబ్దాలూ, సంవత్సరాలూ, రోజులూ పరిచయంలో లేవు.''

"మరి- ఇదేమిటీ విచిత్రం? కాల దూరా లుండవా వాళ్లకు ?"

"ఉండవ్. వాళ్లు నిద్రనూ చావునూ జయించిన తర్వాత కాలానికి ప్రాముఖ్యం నశించింది. దూరానికి ప్రాముఖ్యమును మనమే మన కాలంలోనే నిర్మూలించాం. వాళ్లు గంటలను లక్ష్యపెట్టరు. ఋతువులూ, అయనాలూ, వాళ్లకు సూర్యుణ్ణి వశం చేసుకోవడంతోటే పోయినవి. రాత్రిళ్ళంటూ వాళ్లెరగరు. చీకటి వారి జీవితంలో కన్పించదు"

"మన ఎదుటికి కుంటుతూ మాట్లాడుతూ వస్తున్న వ్యక్తి ఎవరై యుంటారు?"

"అది ఏ వ్యక్తీ కాదు. అది ఒక యంత్రం- ఆ యంత్రానికి శబ్దోచ్చారణ శక్తి ఉంది. దానికి చక్రాల బదులు మానవ స్వరూపంలో వుండే అంగాలు నిర్మితములైనవి. అభావమున కవగాహన అయ్యేట్టు లేదు-''

"అమ్మో-ఏమిటా బ్రహ్మాండమైన పొగ - కాదు. మబ్బుల్లాగున్నదే-వెళదాం-మనను వాళ్లు కనుకున్నారో-ఏమో?''

"ఏమీ లేదది; మనను కనుక్కోండేందుకు వాళ్లతరం కాదు. ఆ పొగను ఒక మనిషి వినోదార్థం తయారు చేస్తున్నాడు; అది కాసేపట్లో అదృశ్యం అవుతుంది."

"ఇంత విజ్ఞాన సముపార్జనంవల్ల వాళ్లు చాలా సుఖంగా వుంటారుగాబోలు! యిల్లాంటి శక్తులను వాళ్లు సాధించారుగా!''

"లేదు వాళ్ళకు "విజ్ఞాన'' మంటే ఏమిటో సరీగా తెలియదు. వీరికన్నా అరుతరాల వెనుక వారి వరకూ విద్యా విధానం వుండేది. ఆ విద్య తమ యంత్ర ప్రపంచంలో నివసించేందుకే పనికొచ్చేది. ఆ విద్యను సినిమాల ద్వారా వారికి నేర్పేవారు తర్వాతనే యింకా జన్మలు అవసరమని శాసించుకున్నారు. వీరికి, విజ్ఞానం పరిపూర్ణంగా అవగతమైంది.''

" మన రోజుల్లో "విజ్ఞానం'' అనంతం అనుకునే వాళ్ళం. వీరు అల్లాంటిదానికి అంతం తెలుసుకున్నారుగా?"

"కాదు, విజ్ఞాన శిఖరాన్ని ఆరోహిస్తున్నామనే దృష్టితో, మనం విజ్ఞానాన్ని సంకుచితం చేయడంసాగించాము. అల్లా పరిమితిలో పెట్టడం మన కాలంలోనే ఆరంభమైంది. దాంట్లో వీరు సిద్ధహస్తులైనారు."

"మన కాలంలో విజ్ఞానాన్ని పరిమితిలో పెట్టిన మాట నిజమేనా?"

"తప్పకుండా! మనకంటే పూర్వకాలంలో పరకాయ ప్రవేశముండేది. అణిమాది అష్టసిద్ధులూ వుండేవి. జలచరాలతో, పక్షులతో యింకా చెట్లతో కూడా మాట్లాడే రకరకాల విద్య లుండేవి. అవన్నీ-మన కాలంలో మన విజ్ఞాన పరిశోధనలోంచి బహిష్కరించేశాము. ఆ శాస్త్రాలూ, ఆ కళలూ అర్థం చేసుకోలేక, అవన్నీ అసత్యం అన్నాము. తర్వాత రాగా రాగా, మనం నమ్మే విషయాలను కూడా వీళ్లు పరిత్యజించి యిల్లా తయారయ్యారు.''

"మన రోజుల్లో నక్షత్రాలనూ, జ్యోతిష శాస్త్రాలనూ నమ్మే వాళ్ళం కాదు. వీళ్ళకా విద్యలు బాగా తెలుసా?''

"ఐతే, వాళ్లకిప్పుడు ఆ నక్షత్రాల పేర్లూ ఆ రేఖల ప్రకృతులూ తెలియవ్. అవి వాళ్ళ కక్కర్లేదు. వాళ్లు కొన్ని నక్షత్రమండలాల్లో ఉండే ప్రాణాన్నిచ్చే పదార్థాలను తెచ్చుకుని వాడుకుంటున్నారు. కొన్ని శాస్త్రాలు కొన్నాళ్ళయిన తర్వాత తమ ప్రాముఖ్యాన్ని విసర్జిస్తయ్. నిజంగా మనం కనిపెట్టిన యంత్ర యుగం మీదనే ఆధారపడి యింతవరకూ యీ జగత్తు నెట్టుకొస్తున్నది కాని కొన్నాళ్ళయింతర్వాత మన శాస్త్రజ్ఞానంతో వాళ్ళకు అవసరం తీరింది. వారి విజ్ఞానాని కందుబాటులో వారు చేసుకున్న కల్పనలే సరిపోతున్నాయి.

"వాళ్ల ఆశ-వాళ్ళ తృప్తి ఎల్లా వుంటయ్యో?''

"మనం వాళ్ల జీవితాల్ని పొందినప్పుడే అవి మన కర్థమవుతాయి.''

"పాపం! వాళ్లను గురించి మాట్లాడుకుండే జనం కొంతమంది అదృశ్య గోళాల్నుంచి వచ్చి పోతుంటారని వాళ్లకి తెలీదుగా!"

"తెలీను, వాళ్లతప్ప, వాళ్ల యంత్రాలు తప్ప, వేరే విశ్వంలో చైతన్యంతో, బుద్ధితో, యింకా వారిని విమర్శించే కొన్ని జీవాలు ఉన్నయ్యని వాళెరుగరు "-అట్లా ఉన్నయ్యేమో నని చాలా మాట్లు ప్రయత్నించి విఫలురై పోయారు. దానికి కారణం వారి పుచ్ఛాలపైవున్న ఆ అతుకున్న తెరే!"

"పోనీ, మనం వాళ్లకు సహాయం చేసి మన స్థలాలకు వీరిని తీసుకుని వెళ్లదామా!"

"వద్దు. అక్కడ మనల్నికూడా యీ యంత్రంతో కట్టి తమరాజ్యాన్ని పాతుకుంటారు."

# కారాగృహం

"దాశరథి"

చీకటి కురుస్తుంది
చిక్కని నెత్తురు చుక్కలు
ఒక్కొక్కగాయంలోంచి
ఊరికే రాలినట్టు.

నిశ్శబ్దత పాకుతుంది
దిగంబర దేహంమీద
తిన్నగా చీమలు నడచినట్టు.

నిశ్చల నయనాల్లోని
చీకటి గోడ
తీవిగా చూస్తుంది
జైల్లో నడిచే నీడల్ని.
ఏదో నెప్పిచూదిరి
గుండెలో ఉద్రేకం పొంగుతుంది.

తలలో పోట్లు పొడిచినట్టు
విస్మృతాలు జ్ఞాపకం వస్తాయి.

కారాగార మృత్తికనుండి
హాహాకార ధూమం లేచి
ఇనుప ఊచలై పూరుకుంటుంది.

బేడీలు ఏడుస్తాయి
గొలుసులు గోలపెడతాయి
కొరడాలు
దండనాయకుల
దౌష్ట్యానికి అక్రందిస్తాయి.

నేస్తం!

ఇది యుగయుగాల ధర్మం,
అర్థంకాదు దీని మర్మం
సనాతనం ఈ
దౌర్జన్య విధానం.

నేడు అహింసా వాదులే
దీనికి ప్రాణం.

ఈ నిశ్శబ్దపు ఎడారిలో
ఇంకి పోతాయి మహానదులు.
కన్నీళ్లు నేలకురాలవు
బందబారి కూర్చుంటాయి.

ఏడిచీ లేదు లాభం
మొర ఆలకించడెవ్వడు.
ఇక్కడి అణువణువూ
వేటకాడుగా వచ్చి
వేటాడుతుంది మనను.

ఈ నిరంకుశ విధానాన్ని
ఒక్కసారుగా మనమే కాల్చేయాలి.
ఈ కంచు గోడను పునాదుల్తో
ఒక్కసారుగా మనమే పేల్చేయాలి.

[మూలం : సర్దార్ జాఫరీ]